


# బలి

పాలరాతి శిల్పంలా నిశ్చలంగా కూర్చుంది శచి. శూన్య నయనాలతో ఎదురుగా వున్న గోడ వంక చూస్తూందామె.

"ఏమ్మా! ఒంట్లో ఎలా వుంది?" ఆమె భుజంమీద చెయ్యేసి ఆప్యాయంగా అడిగింది శ్రుతి.

"ఏం బావుండడం, ఎత్తుబారం బావుండడం..." శచితల్లి వైదేహి పెద్దకంఠంతో అందుకుంది.

"ఒక్క నిమిషం, మీరిలా రండి" వైదేహి చెయ్యి పుచ్చుకుని ప్రక్క రూమ్‌లోకి తీసుకు వెళ్ళింది శ్రుతి.

"ఆ అమ్మాయి ఝడుసుకునేలా మీరంత గట్టిగా చెప్తే యెలా?" మందలింపుగా అడిగింది శ్రుతి.

"నా తీరే అంత. ఇప్పుడు క్రొత్తగా ఏం నేర్చుకుంటాను?" కరుగ్గా అంది వైదేహి.

"శచి పూర్తిగా కోలుకోకుండానే వద్దన్నా వినకుండా తీసుకెళ్ళిపోయారు." ఆవిడ మాటల్ని పట్టించుకోకుండా ఏదో చెప్పబోతున్న శ్రుతిని మధ్యలోనే ఆపిందావిడ.

"అంతా మా ఖర్మ. నేనట్లాంటి నోములు నోచాను. ఇట్లాంటి కొరకరాని కొయ్య పుట్టుకొచ్చింది" ఆవిడ వేదాంత శ్రవణం చిరాకు పుట్టిస్తూంది శ్రుతికి.

"లక్షణంగా పెళ్ళిచేస్తే మొగుడితో కాపరం చేసుకోకుండా ఈ పెంకెతనమేమిటి, మీరైనా చెప్పండి" శ్రుతిని నిలదీసిందావిడ. ఆవిడలా అనగానే మొదటిసారి తను చూసిన శచి రూపం గుర్తుకొచ్చి వెన్ను జలదరిస్తూంది శ్రుతికి.

వాచిపోయి ఎర్రగా వున్న కళ్ళు, కందిపోయిన చెక్కిళ్ళు, కుసుమ కోమలంగా వున్న ముఖం నిండా గాట్లు, చిద్రమై తెగి వేలాడుతున్న మల్లెలమాల, మెడలో పసుపుతాడు, రక్తసిక్తమైన తెల్లచీర, పెను తుఫానులో లేలేత ఆకులా కంపిస్తున్న శరీరం... శచిని చూడగానే బాధతో వొణికింది శ్రుతి గుండె.

"ఏం జరిగిందమ్మా?" శచిని పరీక్షచేస్తూ శచి వదిన సువర్చలను అడిగింది శ్రుతి.

"ఈ రోజు శోభనం..." సంకోచంతో, సిగ్గుతో ఆగిపోయిందామె.

"ఏమవుతుందీ అమ్మాయి మీకు?" సెలైన్ స్టార్ట్ చేస్తూ అడిగింది శ్రుతి.

"మా ఆడబడుచు."

"మీరు కాసేపు బయట కూర్చోండి" గ్లవ్స్ చేతికి తొడుక్కుంటూ చెప్పింది శ్రుతి. శచిని టేబిల్ మీదకు మార్పించి మర్మావయవాల్ని విడదీసి రక్తం ఎక్కడి నుంచి వస్తుందో చూడడానికి ప్రయత్నించింది. మత్తు ఇంజక్షన్ చేసినా బాధతో విలవిలలాడింది శచి. మర్మావయవాలు, యోని ద్వారం, యోని లోపలి భాగం లోతుగా చీరుకుపోయాయి. చీరుకుపోయిన చోటల్లా కుట్టి బ్లీడింగ్ ఆగిందని నిర్ధారణ చేసుకుని, గాయాలన్నిటికీ ఆయింట్‌మెంట్ రాసింది శ్రుతి.

ఒక బాటిల్ రక్తం, రెండు బాటిల్స్ సెలైన్ ఎక్కించాకగాని శచి జనరల్ కండిషన్ మెరుగుపడలేదు. మరునాటి ఉదయం దాకా భయంతో, బాధతో శచి వేస్తున్న కేకలు శ్రుతి చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. ఏ చిన్న శబ్దమయినా సరే, తన భర్తే వస్తున్నాడేమోనని బెదిరిపోతూ విహ్వలంగా అరుస్తున్న ఆ పసిదాన్ని చూస్తుంటే హృదయం దేవేసినట్లుగా వుంది శ్రుతికి.

"యింత చిన్నపిల్లకి అప్పుడే పెళ్ళి చేశారేమిటమ్మా?" సువర్చలను అడిగింది శ్రుతి. అప్పటిదాకా సువర్చలలో ఆవిర్లు కక్కుతున్న ఆవేశం శ్రుతి ప్రశ్నతో ఒక్కసారిగా బయటికి పొంగింది.

"ఏం చెప్పమంటారు, ఒర్థిమూర్ఖులు. నేనూ మావారూ అప్పుడే దానికి పెళ్ళేమిటి, చదివించుదామని చివరి క్షణం దాకా దెబ్బలాడాము. వినిపించుకుంటేనా?! మా అత్తగారిది మొండిపట్టు. ఇంతోటి సుగుణాభిరాముడు మరి దొరకనే దొరకడని ఆవిడ అభిప్రాయం... దానికి నిండా పన్నెండేళ్ళు లేవు. మెచ్యూర్ అయి రెండు నెలలన్నా అవలేదు. ఆ మహాను భావుడు దీని ప్రాణం తియ్యడానికి ముప్ఫైయేళ్ళు నిండుతున్నా యిప్పటిదాకా పెళ్ళిచేసు కోకుండా కూర్చున్నాడు. మా అత్తగారికి స్వయానా తమ్ముడు - దానికితోడు వెయ్యిరూపాయల ఉద్యోగం, వెనక కట్టుకుపోయినా తరగనంత ఆస్తి. డబ్బు మైకంలో ఆవిడకు యింకేం తెలియడం లేదు. అతని తిరుగుళ్ళు, వ్యసనాలు తెలిసి కూడా పెళ్ళయితే వాడే కుదురుగా

వుంటాడని కొట్టి పారేసి మా అందరితో యుద్ధం చేసి ఈ పిల్ల మెడలు వంచి తాళి కట్టించింది.''

"భలే ఆవిడే!'' ఆశ్చర్యంగా చూసింది శ్రుతి.

"భలే ఆవిడని నెమ్మదిగా అంటారు, దేవాంతకురాలు! అంత డబ్బుయావ వున్న మనిషిని ఇంకెక్కడా చూడం... ఇంక అతనెలాంటి వాడో చూశారుగా!'' ఏదో పీడకల కంటున్నట్లుగా సువర్చల కళ్ళు భయంతో, బాధతో రెపరెపలాడాయి.

"అతి భయంకరంగా రేప్ చేశాడు దాన్ని. భయంతో అది అరిచిన అరుపులు విని నా గుండె లవిసిపోయాయి. దాని ఏడుపు విని నా ప్రాణం కడగట్టిపోయింది'' సువర్చల గొంతు రుద్ధమయింది.

నాలుగయిదు రోజుల్లో శారీరకంగా కొంత కోలుకుందిగాని మానసికంగా అలాగే వుంది శచి. అవే బిత్తర చూపులు, భయంతో కంపించి పోవడం, వున్నట్టుండి పెద్దగా ఏడవడం, ఆమె భయాన్ని పోగొట్టి మానసిక స్వాస్థ్యం చేకూర్చడానికి శ్రుతి ప్రయత్నిస్తూ వుండగానే శచి తల్లి బలవంతంగా ఆమెను యింటికి తీసుకుపోయింది.

"మిమ్మల్నే'' వైదేహి అదిలింపుతో వాస్తవంలోకి వచ్చింది శ్రుతి.

"దాన్లో ఏం జబ్బుందో కాస్త కనిపెట్టి చూడండి. ఆడినో దెయ్యాన్ని చూసినట్లు చూస్తాంది. ముట్టుకుంటే చాలు తెలివితప్పి పడిపోతాంది. దీని వాలకం చూసి దీన్నసలు ఏలుకోను పొమ్మంటున్నాడు. ఇంకో పెళ్ళి చేసేసుకుంటానంటున్నాడు... నాలుగు రోజుల్లో కోలుకుని కాపరానికెళ్ళేలా మంచి మందులు రాసివ్వండి. మీ ఋణముంచుకోను.'' బడబడ చెప్పుకు పోతూందావిడ.

"ఆ అమ్మాయినిప్పుడు కాపరానికి పంపడం కంటే తెలివితక్కువ పని మరొక టుండదు. కొన్నాళ్ళు ఆమె మానాన ఆమెను వదిలేయండి. చదువుకోనివ్వండి. ఏదో ఒక వ్యాపకంలో పడితే అన్నీ క్రమేపీ సర్దుకుని మామూలు మనిషవుతుంది. అప్పుడు ఆలోచించుదురుగాని కాపురానికి పంపే సంగతి.'' ఆవిడ దురుసుగా మాట్లాడుతున్నా సహనం వహించి ఆమెతో ఎంతోసేపు వాదించి నచ్చజెప్పాలని చూసింది శ్రుతి.

"మంచి బాగా చెప్తున్నావు. నీ దగ్గరకు రావడం కొరివితో తల గోక్కున్నట్లుగా ఉంది. చాల్చాల్లే యిట్టాంటి సలహాలింకెవ్వరికీ యివ్వమాక. కాపరం నిలబెట్టడం గొప్పగాని, కాపరం కూలదొయ్యడం పెద్ద బ్రహ్మవిద్యకాదు'' తెల్లబోయి చూస్తున్న శ్రుతిని దులిపేసి రుసరుసలాడుతూ శచి చెయ్యి పుచ్చుకుని బరబరా లాక్కుపోయింది వైదేహి.